# ఎడారిలో గులాబి

'చిత్ర'



జనాన్ని ఎత్తుకు పోవడాని కొచ్చిన దొంగలా కొంగ జపం చేస్తోంది రైలు. హడావుడిగా చెరువులో చేపల్లా తిరుగుతున్నారు జనం. గబగబా సీటు చూసుకుని కూచున్నారు. మే నెల. ఎండ మాడ్చేస్తోంది. గోదారిలా పొంగుతున్న చెమటని తుడుచుకుంటూ చుట్టూ చూశాను. ఎక్కడా 'రంగు' లేదు. అంతా నలుపే. ఎదురుగుండా ఒక ముగ్ధ ఉందనుకుంటే అదీ కరివుబ్బే. సరే అని నిట్టూరుస్తూ కూచున్నాను.'

"ఎక్స్క్యూజిమి! ఆ ఎక్స్‌ప్రెస్ ఒక్కసారిస్తారా?" పక్కన కూచున్న ఆయన అడుగుతున్నాడు. ఇచ్చాను. సిగరెట్టు వెలిగించి ఒక్క దమ్ము లాగాను. మళ్ళీ ఒక్కసారి చుట్టూ చూశాను- ఎక్కడైనా కాస్త 'రంగు తడి' తగిలిపోతుందా? అని. ఉహూ. ఒక పావు గంట గడిచింది.

"ఎక్కడి దాకా మీరు?" పేపరు ఇచ్చేస్తూ అడిగాడు పక్కాయన.

"హైదరాబాద్. మీరు?" యాంత్రికంగా అడిగాను.

"నేనూ అక్కడికే."

పేర్లూ, అడ్రెసులూ చెప్పుకోవడం అయింది. ఎమ్. కామ్. చదివాడట ఆయన. మంచి మాటకారి. కంపార్టుమెంటులో అమ్మాయిల్లేని కొరత తీర్చేస్తున్నాడు. తన మాటలతో. చార్లీ చాప్లిన్ సినిమాల్లోంచి, ఇంగ్లీష్ నావెల్స్ లోంచి జోక్స్ కోట్ చేస్తూ తెగ నవ్విస్తున్నాడు.

"మీరు చాలా సరదా మనుషులు" అన్నాను మెచ్చుకోలుగా.

"'లాఫ్ ఎండ్ లెట్ లాఫ్' అదీ నా సిద్ధాంతం" అన్నాడు చిరునవ్వు నవ్వుతూ. అతను భుజాలు చిత్రంగా ఎగరేస్తాడు. బక్కపలచగా ఉంటాడేమో, భుజాలు గడ్డం వరకూ ఎగిరి చిత్రంగా కనిపిస్తుంది.

"హైదరాబాద్‌లో ఎక్కడి కెళ్తారు?" అన్నాడు.

"నాంపల్లిలో చుట్టాలున్నారు. మీరు?"

"కేరాఫ్ హైదరాబాద్—అంతే" అని నవ్వుతూ "ఏ లాడ్జి లోనో దిగాలి" అన్నాడు. విజయవాడ చేరింది రైలు. రెండు కాఫీలు తీసుకుని, నా కొకటి ఆఫర్ చేశాడు. తాగి సిగరెట్లంటించాం.

"వెకేషన్ ట్రిప్పా?" అన్నాడతను.

"కాదండీ. చెప్పానుగా—నేను బి. కామ్. పాసయ్యానని. ఇక్కడ ఇంటర్వ్యూ ఉంటేను..."

"ఇంటర్వ్యూకా?" చిత్రంగా నవ్వి అన్నాడతను. "పాపం, ఇంటర్వ్యూని నమ్ముకొని ఇంత డబ్బు తగలేస్తున్న మిమ్మల్ని చూస్తే జాలేస్తోంది. ఐ పిటీ యూ!"

ఎంత స్నేహితుడైనా నన్ను కించపరుస్తున్నాడతను. అమాయకుడ్ని గాడ్యుయేట్ననుకుంటున్నాడు. సరిగ్గా కొట్టాలి దెబ్బ. అందుకే వీలైనంత గర్వం తెచ్చి పెట్టుకుని. "అప్పుడే ట్రయల్స్ అన్నీ అయిపోయాయి లెండి. ఈ రోజు వెళ్ళి నాలుగు వేలూ ఇచ్చేసి జాయినవ్వడమే" అన్నాను ధీమాగా.

"అలాగా?" అంటూ రింగులుగా పొగ వదులుతూ—"గట్టివారే" అన్నాడు.

'మరేంటనుకున్నావ్' అన్నట్టు చూశాను నేను.

ఈలోగా ఏదో స్టేషన్ తగిలింది. తన బ్రీఫ్ కేసు నన్ను చూస్తుండమని వెళ్ళి 'ప్రభ' వీక్లీ కొనుక్కొచ్చాడు. వచ్చిన దగ్గర్నుంచి సీరియస్‌గా ఉన్నాడు, ఏదో ఆలోచిస్తున్నట్టు.

"ఏమి టంత దీర్ఘంగా ఆలోచిస్తున్నారు?"

దానికి వెంటనే జవాబివ్వలేదు. ఒక క్షణం పోయాక— "మిమ్మల్ని బోరు తున్నానా?" అన్నాడు ఇంగ్లీషులో.

"లేదు, లేదు" అన్నాను కంగారుగా. "మీరు లేకపోతే నిజంగానే బోరెత్తి పోయేది." దానికీ సమాధానం చెప్పలేదు. చిత్రంగా తలెగరేసి— "ఎంత చిత్రమైనవీ ఫ్రెండ్‌షిప్‌లు అని ఆలోచిస్తున్నాను. ఇంకో రెండు గంటల్లో మీ రెవ్వరో, నే నెవరో! ఒకర్నొకరు కనీసం కలుసుకోలేం" అన్నాడు. నిజమేననిపించింది నాకూ. ఒక కాగితం మీద అడ్రెస్ వ్రాసి ఇచ్చి— "నేనీ అడ్రెస్ లోనే ఉంటాను. తప్పక కలవండి" అన్నాను స్వచ్ఛంగా.

"రాక తప్పుతుందా?" అన్నాడు.

ఆ మొహం పెట్టిన తీరు చూస్తే ఎవరమైనా నవ్వక తప్పదు.

కాసేపు మళ్ళీ కబుర్లు. హైదరాబాద్ చేరుతూంది రైలు. కాస్త రిఫ్రెష్ అవుదామని అతనితో చెప్పి టాయిలెట్‌లోకి వెళ్ళాను. నేను బయటికి వచ్చేసరికి రైలు అప్పుడే ప్లాట్‌ఫారమ్ మీద ఆగింది. గబగబా వెళ్ళాను, సీటు దగ్గరికి. అతనూ లేడు, నా బ్రీఫ్ కేసూ లేదు. 'ఎక్కడి కెళ్ళాడు చెప్మా' అనుకుంటూ అంతా చూశాను. మనస్సేదో కీడు శంకిస్తున్నా 'ఛ! అతను అలాంటివాడు కాడు' అనుకుంటూ స్టేషనంతా గంటన్నర వెతికాను.

ప్రయోజనం శూన్యం. ఏడుపొచ్చినంత పనవుతూంది నాకు. ఆ బ్రీఫ్ కేసులో నా జీవితం అంతా ఉంది. పదో క్లాసు నుంచి సర్టిఫికెట్లు, దాదాపు రెండు వేల రొక్కం. కాళ్ళు ఆడటం లేదు. రావలసిన జాబ్ చెయ్యి జారిపోతూంది. భవిష్యత్తంతా శూన్యంగా, ఎడారిలా సైమూన్స్‌తో.

ఎలాగో ఇంటికి వచ్చిపడ్డాను. అందరూ కలిసి 'బేరం' కుదుర్చుకున్న ఆసామీకి ఫోన్‌చేసి అంతా చెప్పాం.

"అయామ్ సారీ ఫర్ ది హేపనింగ్. కానీ, నేనేం చెయ్యను—చెప్పండి. నా డబ్బు దేముంది? ఇవాళ కాకపోతే రేపిస్తారు. కానీ, సర్టిఫికెట్లు. అసలు మా ఆఫీసరు చండశాసనుడు. అసలు కాంపిటీషనలా ఉంది. మేక్ యువర్ ట్రయల్స్" అంటూ ఫోను పెట్టేశాడు. ఆ సమయాన నేను తిట్టని తిట్టు లేదు అతణ్ణి.

వెధవ! ఎంత బాగా నటించాడు! ఎమ్.కామ్. ట రాస్కెల్. ఇప్పుడు గుర్తొస్తోంది—వాడు రెండు, మూడుసార్లు దిగుతారా, టాయిలెట్ కెళ్తారా అనడగడం, ఆ బ్రీఫ్‌కేసుని తదేకంగా చూడ్డమూను. ఛ! వెధవని చేశాడు కదా మనల్ని మాటల్లో ముంచి?'

ఎదురుగా ఉంటే హత్య చేస్తానేమో? వాణ్ణి?

ఎక్కడా మానవత్వం, మంచిలేవు. అంతా వంచన దగా, ఎడారి. ఎడారిలో నిలబడి పువ్వుల కోసం చూస్తే ఏమిటి? అంతే! ఆఫీసర్ని కన్విన్స్ చేసుకొస్తానని వెళ్ళిన మామయ్య తిరిగి వచ్చేశాడు. నా అజాగ్రత్తనీ, ఆ ఆఫీసరు కరుకుదనాన్నీతిడుతూ. తొమ్మిదిఅయింది. ఎవరో చిన్నకుర్రాడు-ముష్టివాడులా ఉన్నాడు-గుమ్మం దగ్గరనిలబడి-"ఆనందంగారిల్లిదేనాండి?'అంటున్నాడు

"అవును. ఏం?" అంటున్నా రెవరో ఇంట్లోంచి చిరాగ్గా.

"ఆయ నెవరో ఈ కవరు మీ కిమ్మన్నారు" అన్నాడు బరువైన కవరు ఇస్తూ.

ఆత్రంగా విప్పి చూస్తే— అన్నీ నా సర్టిఫికెట్లు—అన్నీ భద్రంగా. వాటితో ఒక లెటరు.

"నేను చేసిన పని ఎంత ఘోరమో, నీచమో నాకు తెలుసు.కానీ ఆకలి కడుపుతో దబ్బులాట్లు గుచ్చుతున్నా అదర్శాలట్టుకు వేలాడ్డం నాచేతనైనా, నా వెనకనున్న ఆరుమంది నా కుటుంబ సభ్యులకి చేతకాదు. ఇప్పుడేం జరుగుతుందో ఊహించగలను. అందుకే మీ సర్టిఫికెట్లన్నీ పంపిస్తున్నాను. సారీ, డబ్బు పంపలేను. పదివేలు తిన్న నా ఎమ్.కామ్. సర్టిఫికెట్ తీర్చలేని నా ఆకలి అది తీరుస్తుంది. ఈ రోజునా విక్టిమ్ మీరు కావడం మీ దురదృష్టం. కానీ, ఇది నా వృత్తి. సెలవు"

కుర్రాణ్ణి తీసుకుని వెళ్ళాను. అతనుంటాడన్న చోటుకి—అతని కాళ్ళమీద పడదామని. వేలవేల కృతజ్ఞతలు చెప్పుకుందామని. కానీ, అతనక్కడలేడు.

నిజంగా అతను ఎడారిలో గులాబి పువ్వు.

ఎంత సంస్కారం! నా జీవితం కాపాడాడు.

ఈ రోజు ఆఫీసు కుర్చీలో నేను కూచోబోతున్నప్పుడల్లా అతను గుర్తొస్తాడు నాకు.

"లాఫ్ ఎండ్ లెట్ లాఫ్" అంటూ. ★